# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

To be wronged is nothing unless you continue to remember it.
--- Confucius

# వేమూరి బలరాం - 2



*మిత్రులు శ్రీ వేమూరి సత్యనారాయణ క్రిందటి సంచికలో జరిగిన కథని చదివి ఈ కరెక్షన్ చెప్పారు.*

*'స్వాతి మంత్లీని స్థాపించిన వారు ముగ్గురు అని రాసారు. నిజానికి మేము నలుగురం. వేమూరి బలరాం, వేమూరి సత్యనారాయణ, నాగేశ్వరరావులతో పాటు తుమ్మల గోపాలరావు కూడా దాని భాగస్వామి. మేం నలుగురం ఒకే ఊరి వాళ్ళం. అది కృష్ణాజిల్లాలోని ఘంటసాలపాలెం. తుమ్మల గోపాలరావు గారు మాత్రం తర్వాత ప్రభవ అనే మాసపత్రికని ఆరంభించి కొంతకాలం గౌస్ (శాతవాహన) సంపాదకత్వంలో నడిపారు ఇప్పుడు అది రావడంలేదు.'*

ఓసారి పుస్తకానికి తగిలించుకుని చీకట్లో చదివేందుకు అనుగుణంగా తయారు చేసిన బేటరీతో నడిచే బుక్‌లైట్‌ని నేను కొన్నాను. దాన్ని బలరాం గారికి చూపించాను. నేను రాసిన ఓ సీరియల్‌కి పాఠకుల పోటీని ప్రకటించినప్పుడు అలాంటి బుక్ లైట్లని బహుమతిగా బలరాం ప్రకటించారు. ప్రకటించడానికి మునుపే విజయవాడలోని ఓ దుకాణం నుంచి అవసరం ఉన్న మేరకి వాటిని తెప్పించి మరీ ఆ ప్రకటనని ఇచ్చారు. తర్వాత నిజాయితీగా వాటిని బహుమతి గ్రహీతలకి పంపారు. నా నవలలని కూడా బహుమతిగా ప్రకటించినప్పుడు పబ్లిషర్లని నమ్మి వారికి వదలకుండా ఆ బహుమతి కాపీలని తీసుకుని, తమ ఆఫీసు నుంచి పాఠకులకి పంపేవారు. మాట తప్పకపోవడం అన్నది ఆయన స్వభావం.

1990లో నేను అమెరికాకి వెళ్ళి వచ్చాక 'ట్రావెలాగ్ అమెరికా'ని స్వాతి వీక్లీలో సీరియలైజ్ చేసారు. నేను ఆ ట్రిప్‌లో తీసిన ఒకో ఫోటోకి నాకు పాతిక రూపాయలు ఖర్చయ్యాయి. ఇప్పటిలా 'డిజిటల్, డౌన్ లోడ్' కెమెరాలు కావు. ఫిల్మ్ కొని లోడ్ చేసి కడిగించి ప్రింట్స్ తీయాలి. కాని నాకు ఫోటోకి పదిహేను రూపాయల చొప్పున పారితోషికం పంపితే ఆ సంగతి లెటర్ రాసాను. కాని తన పాలసి ప్రకారం అంతకు మించి పంపలేనని జవాబు రాసారు. 'ట్రావెలాగ్ అమెరికా'ని నేను ఆ తర్వాత కొనసాగించకుండా పుస్తకంగా తీసుకువచ్చాను. దాన్ని అలా విరమించుకోకూడదనే విజ్ఞత ఆ రోజుల్లో నాకు లేకపోయింది.

నేను జ్యోతి, ఇతర వీక్లీలకి సీరియల్స్ రాయడం తనకి ఇష్టం లేదని బలరాం అనేకసార్లు చెప్పారు. అందుకు కారణం కూడా చెప్పారు.

"పాఠకులకి మీ సీరియల్ చదవడానికికి ఒక్క స్వాతి వీక్లీ మాత్రమే ఉంటేనే నాకు ప్రయోజనంగా ఉంటుంది. ఇప్పుడు వారికి ఛాయిస్ ఉంది కాబట్టి స్వాతి మాత్రమే కొనాలని ఉండదు."

"కాని నేను ఒకసారి రెండు సీరియల్స్ రాస్తూంటాను. మరి రెండోది ఇంకెక్కడ రాయాలి?"

ఆ ప్రశ్నకి ఆయన దగ్గర జవాబు లేదు. ఎందుకంటే ఒకేసారి స్వాతి వీక్లీలో రెండు సీరియల్స్ వేస్తే, అభిరుచి, పోలికలని బట్టి ఒకటి బావుంది ఇంకోటి బాగాలేదు అనే అభిప్రాయం పాఠకుల్లో కలుగుతుంది అని ఆయనకి తెలుసు. నా పేరు అన్నిచోట్లా కనపడుతూంటేనే స్వాతి పాఠకులు దాన్ని తేలిగ్గా గుర్తుపడతారనే వాదనని కూడా చెప్పేవాడిని.

భూమి వీక్లీని అధిగమించి స్వాతి వీక్లీని నంబర్ వన్ చేయాలన్నది ఆయన గాఢమైన కోరిక. అందుకోసం అహర్నిశలు ఆయన కృషిచేసేవారు. ఆ పనే తప్ప ఆయనకి ఇంకేం పట్టేదికాదు. సహజంగానే వర్క్‌హాలిక్ అయిన బలరాం స్వాతి వీక్లీ అభివృద్ధికి తన ప్రాణం

పెట్టారు. స్వయంగా పుస్తకాల స్టాండ్స్‌కి వెళ్ళి, తర్వాత మనుషుల్ని పెట్టి ఇతర వారపత్రికలని పక్కన పెట్టించి స్వాతి వీక్లీ బయటకి పాఠకులకి కనపడేలా తోరణాల్లా కట్టించేవారు. సర్క్యులేషన్ పెంచడానికి ఏజెంట్లతో సత్సంబంధాల్ని కలిగి ఉంటూ, అనేక ఊళ్ళల్లో వారితో మీటింగ్స్ పెట్టి, వారికి సర్క్యులేషన్‌ని పెంచమని టార్గెట్స్ ఇవ్వడం, బ్రీఫ్ కేసుల్లాంటి బహుమతులు ఇవ్వడం చేసేవారు. ఆయన స్వాతి వీక్లీకి ఎడిటరే కాక యజమాని కూడా అవడంతో ఇది సాధ్యం అయింది.

మిగిలిన ఎడిటర్లు యజమానులు కారు. కాబట్టి వారు తమ పరిధిలోని ఎడిటోరియల్ సమర్ధత ద్వారానే సర్క్యులేషన్‌ని పెంచే కృషిచేసేవారు. వారి పరిధికన్నా బలరాం పరిధి స్వాతి యజమానిగా ఎక్కువ విస్తరించుకుని, మిగిలిన ఎడిటర్లలా కాక స్వతంత్రుడు అవడంతో ఆయనకి ఏం చేయాలన్నా స్వేచ్ఛ ఉండేది. చివరికి కృషి ఫలించి, 1991లో అనుకుంటా స్వాతికి లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ సర్టిఫికెట్ 'బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్' నుంచి లభించింది. ఐతే ఆయన ప్రొప్రయిటర్ కం ఎడిటర్ అవడం వల్ల దీన్ని మేనేజ్ చేసారనే వాదనని విన్నాను. కొందరు ఏజెంట్లకి ఎక్కువ కాపీలకి బిల్లు ఇచ్చి, వారు ఇచ్చిన చెక్ కేష్ అయ్యాక వారి డబ్బు వారికి నగదుగా ఇచ్చేసారన్నది నాకు గుర్తున్న వదంతుల్లో ఒకటి. ఐతే ఎవరు పైకి వచ్చినా వారి మీద అపవాదు రావడం చూస్తూనే ఉంటాం. కానీ తర్వాత కూడా స్వాతి వీక్లీ సర్క్యులేషన్ పెరుగుతూ వచ్చింది తప్ప తగ్గలేదు. కాబట్టి అది కేవలం వదంతే అని భావించవచ్చు. లేదా తాత్కాలిక లాభం కోసం ఆయన ఆ పనిచేసినా, సత్తా వల్ల ఆ తర్వాత స్వాతి వీక్లీ నిలదొక్కుకుని ఉండచ్చు.

1990ల చివర్లో జెమిని, ఈనాడులాంటి ప్రైవేట్ ఛానల్స్ రాక మునుపు స్వాతి ఇంతదాకా ఏ తెలుగు వారపత్రికా ఎదగనంత సర్క్యులేషన్‌కి ఎదిగి నాలుగు లక్షలకి చేరుకుందని ఎవరో చెప్పారు. ఐతే అన్ని వారపత్రికల సర్క్యులేషన్ తగ్గినట్లే ప్రైవేట్ ఛానల్స్ వల్ల 2000లలో స్వాతి సర్క్యులేషన్ కూడా సగానికి పైగా పడిపోయిందని కూడా విన్నాను.

బలరాం ఖచ్చితమైన మనిషి కాబట్టి ఎవరినుంచీ ఏదీ ఉచితంగా తీసుకునేవారు కారు. ప్రచురించబడ్డ ప్రతి రచనకీ స్వాతి నుంచి రచయితకి పారితోషికం వెళుతుంది. ఈ రోజు తెలుగు కథా రచయితకి అత్యధిక పారితోషికం ముట్టేది స్వాతి వీక్లీనుంచే. గురువారం స్వాతి వీక్లి ఎలా వెలువడుతుందో అలాగే తన రచన వెలువడ్డాక ఎన్నిరోజుల్లో తనకథకి పారితోషికం స్వాతి నుంచి అందుతుందో రచయితకి హామీ ఉంటుంది. క్రమం తప్పకుండా గడియారం పని చేసేవిధంగా పారితోషికం పంపే మెకానిజం స్వాతిలో ఉంది. ఇప్పుడు కథ ఎంపిక చేసుకోగానే ఎప్పుడు ప్రచురిస్తారు అన్నదానితో సంబంధం లేకుండా స్వాతి నుంచి అంగీకారపత్రంతో పాటు పారితోషికం అందుతోందని ఓ రచయిత ఆ మధ్య నాతో చెప్పారు.

ఇక్కడ ఓ ఉదాహరణని ఇస్తాను. ఓ మంత్లీలో నెలనెలా నా కాంట్రిబ్యూషన్ వస్తోంది. మొదటి రెండు నెలలు వెలువడ్డ రెండు సంచికలకి తర్వాతి నెల్లో పారితోషికం అందేది. ఆ తర్వాతది ఆగిపోయింది. కొన్ని నెలల తర్వాత దాని వర్కింగ్ ఎడిటర్‌కి పారితోషికం గురించి ఈ మెయిల్ ఇస్తే నా చెక్ తన దగ్గరే ఉందని, వచ్చి తీసుకుంటారా అని జవాబు ఇచ్చారు! చెక్ కోసం వచ్చి వెళ్ళడానికి నాకు మూడు గంటలు ఖర్చవుతుందని, దయచేసి పోస్ట్ చేయమని చెపితే చెక్ అలా పంపారు. చెక్ మీద తారీకుని బట్టి అది అతనికి అందిన మూడు వారాలకి నాకు పంపారు! నేనా ఈ మెయిల్ ఇవ్వకపోతే అది ఆయన డ్రాయర్ లోనే ఇంకా ఉండేదేమో? ఓ మనిషి ఎదగడానికి అతని దృక్పథమే సాయం చేస్తుంది. లేదా దిగజారడానికి. పారితోషికం చెల్లించక పోవడంతో పాఠకులకి సరైన రచనలని అందించలేక, సర్క్యులేషన్ బ్రేక్ ఈవెన్ కాక మూసేసిన ఎన్నో పత్రికల అధిపతులు, ఎడిటర్లని నేను చూసాను కాబట్టి ఈ విషయంలో బలరాం చుక్కల్లో చంద్రుడిలా కనిపిస్తారు.

అలాగే స్వాతి మంత్లీకి ఓ సీరియల్ (పేరు గుర్తులేదు) అడిగితే రాసాను. ఆయనకి ఆ సీరియల్ నచ్చలేదు. ఓ రోజు దాన్ని ఆపేద్దామని చెప్పారు. వీక్లీ సీరియల్ విషయం నాకు వదిలేసినా మంత్లీ విషయంలో ఆయన తన పట్టుని వదల్లేదు. పారితోషికం కూడా

మంత్లీకి ఎక్కువ ఇవ్వలేదు. నెలకి ఇంతని ఇచ్చేవారు. మరోసారి గొలుసు సీరియల్ ప్రక్రియని స్వాతి మంత్లీలో ఆరంభించి మొదటి సంచికని నా చేత రాయించారు. దాని పేరు 'నన్ను ప్రేమించు'. తర్వాత చాలామంది దాన్ని కొనసాగించి పూర్తిచేసాక బలరాం గారే దాన్ని స్వాతి సంస్థ తరఫున పుస్తకంగా వేసారని గుర్తు. 'అదిగో పులి' నవలని కూడా పుస్తకంగా స్వాతి ప్రచురణగా ఆయనే తొలి ముద్రణ వేసారు.

'క్రేజీ అమెరికన్స్, పొరపాట్లు – అగచాట్లు' అనే శీర్షికలని కూడా కొంతకాలం డి.పద్మజ అనే కలం పేరుతో స్వాతి మంత్లీలో రాసాను. అలాగే అమెరికన్ పత్రికల్లో వచ్చిన తమాషా ఫోటోలని కూడా డి.పద్మజ పేరు మీద పంపితే ప్రచురించేవారు. ఓసారి దర్శకుడు వంశీ చెప్పారు, డి.పద్మజ అంటే ఎవరని తను బలరాంని ఎన్నిసార్లు అడిగినా చెప్పలేదని, చివరకి అది నా కలం పేరే అని తెలిసిందని, సినిమాకి కాని, నవలకి కాని డి.పద్మజ అనే పేరు పెట్టాలని తనకి ఉందని. ఏదీ శాశ్వతం కాదు అని ఋజువు చేస్తూ మా మధ్య చీలిక రావడానికి కారణం ఈ పేరే.

బలరాం రవీంద్రభారతిలో ఏదో ఫంక్షన్ జరిపారు. బహుశా లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ అయిన ఫంక్షన్ అయి ఉండచ్చు. దానికి పోస్ట్‌లో ఆహ్వానం వచ్చింది. సాధారణంగా ఇలాంటి వాటికి నేను హాజరు కాకపోవడం కారణంగా దానికి వెళ్ళలేదు. ఫంక్షన్ అయ్యాక ఫోన్ చేసి రాలేదేమని అడిగారు. టూలేట్. యద్దనపూడి సులోచనారాణిగారిని ఆయన స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారని తెలిసింది. నాకు బలరాం నుంచి ఫోన్ కాల్ కూడా రాలేదు కాబట్టి నన్ను చిన్నబుచ్చారనే భావన కూడా కలగడంతో నేను ఆ ఫంక్షన్ కి వెళ్ళలేదు.

ఈ ఫంక్షన్ అయిన కొద్దిరోజులకి బలరాం నుంచి 1991 లో డి.పద్మజ పేరున ఓ ఉత్తరం వచ్చింది. దాని సారాంశం 'మీ పేరు అనేక పత్రికల్లో కనపడుతోంది. స్వాతికి ఇది కుదరదు. కాబట్టి బయట రాయడం మానేయండి.' బలరాంలో తను గొప్ప ఎడిటర్ అనే అహంభావం ఆయనలో అంతర్లీనంగా కనపడేది. అది మొదటిసారిగా స్వాతి అత్యధిక సర్క్యులేషన్ గల ఓ వార పత్రికని అధిగమించాక నాకు ఆ ఉత్తరం ద్వారా వ్యక్తం చేయబడింది.

స్వాతి వీక్లీ లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ అవడానికి నా సీరియల్స్ కూడా కొంత ఉపయోగించాయి అన్నది నిర్వివాదాంశం. అలాంటి నాకు డైరెక్ట్‌గా రాయలేక నా కలం పేరైన డి.పద్మజ పేరున ఆ ఉత్తరం రాసారు అనుకున్నాను. అది నేను చదవగానే బలరాంకి మందు మీద వచ్చేలాంటి ఆవేశం సోబర్‌గా ఉన్న నాలో కలిగింది.

బదులుగా తక్షణం నా జీవితంలోని అతి దీర్ఘమైన ఉత్తరాన్ని రాసాను. స్వాతి పుట్టుక మునుపు నుంచి నేను రచయితనని, అన్ని పత్రికలకి రాసే స్వేచ్ఛ నాకుందని, ఆ ఉత్తరం ఏరు దాటాక తెప్పని తగలేయడంలా ఉందని, నన్ను సీరియల్ రచయితగా చేసిన క్రెడిట్ గల సికరాజే ఇలా ఎన్నడూ నిబంధనని పెట్టలేదని, ఇలా సాగిందా పెద్ద ఉత్తరం. ఘాటుగా రాసిన ఆ ఉత్తరం పూర్తయ్యాక డ్రాయర్‌లో పడేసాను. ఇలా రాసిన ఉత్తరాలని కోపం తగ్గాక చింపేయడం నాకు మామూలే. ఆ ఉత్తరాల ద్వారా నా వేదన, కోపం కొంత తగ్గుతుంది. కాని ఈసారి రెండు రోజుల తర్వాత కూడా నాకు కోపం తగ్గకపోగా దాన్ని పోస్ట్ చేయాలి అని బలంగా అనిపించడంతో, స్వాతితో తెగతెంపులు చేసుకోవాలనే నిర్ణయించి దాన్ని పోస్టు చేసాను. దానికి ఆయన జవాబు రాస్తారని నేను ఎదురు చూడలేదు. ఆయన్నించి కూడా జవాబు రాలేదు. ఆ ఉత్తరం ఇప్పటికీ బలరాం దగ్గర ఖచ్చితంగా ఉంటుంది. ఆయన ఉత్తరాలని పారేయడని నాకు అనుభవపూర్వకంగా తెలుసు. అప్పట్నించి స్వాతి సంస్థకి రచనలు మానేసాను. వారూ పూర్వంలా కోరడం మానేసారు.

'ఇల్లాలికి సలహాలు' అనే శీర్షికని లేడీస్ పేజీకి రాసి పంపేవాడిని. ఈ గొడవ జరిగాక దాన్ని వారు 'ఇల్లాలికి చిట్కాలు'గా పేరు మార్చి ఇంకా కొనసాగిస్తున్నారు. స్వాతిలో వచ్చిన 'ఇల్లాలికి సలహాలు' అన్నీ కలిపి లిపి పబ్లికేషన్స్ నుంచి అదే పేరుతో పుస్తకంగా ప్రచురించాను. స్వాతి వీక్లీలోని ఆఖరు పేజీలో వచ్చే 'ఈ శీర్షిక మీదే'లో రెండూ కలిపి చదివితే నవ్వొచ్చే ప్రశ్న – జవాబు వేసి, మొదటి

బహుమతిగా ఎన్నుకున్నది దానికి మాత్రమే నగదు బహుమతి ఇచ్చేవారు. మిగిలిన వారికి అప్పట్లో స్వాతి వీక్లీ ఇచ్చే బహుమతి ఏం లేదు కాబట్టి నా పుస్తకాలు ప్రచురించే ప్రచురణ సంస్థలు మరో అయిదారుగురు విజేతలకి నా నవలలని బహుమతిగా పంపేవి. ఇది ఆ శీర్షికలో ప్రకటించేవారు. ఇందువల్ల నా నవల విడుదలైందని పాఠకులకి తెలుస్తుందన్నది ప్రచురణ కర్త ప్రయోజనం అయితేం ఎక్కువ మంది పాఠకులకి బహుమతులు లభిస్తాయి అన్నది స్వాతికి ప్రయోజనం. నా ఉత్తరం అందుకున్నాక ఈ బహుమతులని బలరాం తర్వాతి సంచిక నుంచి నిలిపివేసారు. వెంటనే స్వాతిని ఇక వేయడం ఆపేయమని న్యూస్ ఏజెంట్‌తో చెప్పాను. ఈ రోజు దాకా అదే కొనసాగుతోంది. నేనా పత్రికని చదవడం లేదు. ఒకే ఒక్కసారి తిరుమలలో పనిచేసేప్పుడు తన అనుభవాలని రాసిన పివి.ఆర్.కె ప్రసాద్ రాసిన శీర్షికని మాత్రం ఆ కాపీలు ఎవరో ఇస్తే చదివాను.

పూర్వం నా నవలలు వేసే నలుగురు ప్రచురణ కర్తలకి పాతిక శాతం ప్రత్యేక రాయితీ ఇచ్చి, స్వాతి వీక్లీ, మంత్లీలలో ప్రకటనలని బలరాం నా ద్వారా అడిగించి తీసుకునేవారు. ఆ రోజుల్లో ఆ అవసరం స్వాతి వీక్లీకి ఉంది. అలా నా ప్రచురణ కర్తలు ఆయనకి పరిచయం అయారు. తర్వాత వాళ్ళు స్వాతి ఆఫీసుకి పనిమీద వెళితే కాగితం మీద వారి పేరు రాయించి పంపమని చెప్పి, చాలాసేపు కూర్చోపెట్టడంతో వారు మళ్ళీ స్వాతి ఆఫీసుకి వెళ్ళలేదు. ఇలా బలరాంలో తను గొప్ప ఎడిటర్ అని అహంభావం వృద్ధి చెందడం గురించి ఆ తర్వాత అనేకమంది ద్వారా తెలుస్తూండేది. స్టాఫ్ ఆయన్ని ఉద్దేశించి 'చెయిర్‌మన్ గారు బిజీగా ఉన్నారు' అన్నారని మరొకరు చెప్పారు. బోర్డుకి చెయిర్‌మన్ కాని పబ్లిక్‌కి మొదటి నుంచీ ఆయన ఎడిటర్‌గానే పరిచయం కదా? క్రమేపీ స్వాతి వీక్లీలో కూడా ఆయన్ని ఎడిటర్‌గా పొగుడుతూ ఉత్తరాలు వస్తూండేవి.

మొదట్లో 'స్వాతిలో మీ సీరియల్ మళ్ళీ ఎప్పుడు?' అని పాఠకులు అడిగేవారు. ఇక రాదని కొంతకాలం గడిచాక అర్థమవడంతో క్రమేపి అదీ తగ్గిపోయింది. మా ఇద్దరి ఇగోల క్లాష్ వల్ల నష్టపోయింది స్వాతి పాఠకులు. నా సీరియల్స్ చిన్న పత్రికల్లో వస్తూండటంతో వారు వాటిని మిస్ అయ్యారు. స్వాతి ఇచ్చే పారితోషికమే నాకు ఆ పత్రికల నుంచీ ముట్టడంతో నేను ఆర్థికంగా నష్టపోకపోయినా, నా సీరియల్స్‌ని పాఠకులు విస్తృతంగా చదివే అవకాశాన్ని నేను కోల్పోయాను. కాని నా రచనలని అభిమానించేవారు మాత్రం ఆ చిన్న పత్రికలని వదల్లేదు. 1990ల తర్వాత క్రమేపీ నవలల మీద ఆదరణ అప్పుడే వచ్చిన ప్రైవేట్ టీవీ ఛానళ్ళ వల్ల తగ్గుముఖం పట్టింది. స్వాతి మీద కూడా వాటి ఛాయలు పడ్డాయి. స్వాతి సర్క్యులేషన్ పడిపోయినప్పుడల్లా స్వాతి ప్రకటనలు బాగా కనిపించేవి. అవి కనిపిస్తే స్వాతి సర్క్యులేషన్ తగ్గిందని అనుకునేవాడిని.

ఓ యజ్ఞంలా ఇంతకాలం బలరాం స్వాతిని నిలబెట్టుకుంటూ వస్తున్నారు. అందుకోసం చాలా ముఖ్యమైనవి వదులుకున్నారు. కాని అది ఒక్కటే జీవిత పరమావధి అనుకోవడం గురించి ఆయన పునరాలోచించుకోవడం మంచిది అని నా అభిప్రాయం. ఎందుకంటే అది ఆయనతోనే ఆగిపోయే ప్రమాదం ఉంది. ఆ తర్వాత బలరాం లాంటి వ్యక్తిత్వం గల ఇంకో మనిషి దాన్ని నడిపితే తప్ప స్వాతి నంబర్ ఒన్ స్థానాన్ని నిలబెట్టుకోలేదు. ఎవరి విషయంలోనైనా సరే, తనకి ఉన్నవి ప్రపంచంలో ఎందరికో లేనప్పుడు వారికి సంతోషంగా, తృప్తిగా ఉంటుంది. కాని ప్రపంచంలోని ఎందరికో ఉన్నవి తనకి లేకపోయినప్పుడు తను వారికన్నా ఓ మెట్టుకింద ఉన్నట్లే అవుతుంది.

ఏది ఏమైనా ఓ తెలుగు వారపత్రిక ద్వారా దాదాపు కొన్ని వందల కోట్ల రూపాయలని సంపాదించవచ్చని బలరాం తెలుగు వారికి నిరూపించారు. ఆయన అందుకు అనుసరించిన పద్ధతులని, పడ్డ శ్రమని అనుసరిస్తే మాత్రం ఆ మార్గం ఎప్పుడూ తెరిచే ఉంటుంది. కాని అందుకు వ్యాపారం చేసారు. కాని, ఇవ్వాల్సిన పావలాని ఎగ్గొట్టి అది 'ఖర్చులు తగ్గించుకోవడం లేదా లాభం' అనుకునే వారు ఉండటంతో మరో స్వాతి తెలుగు వారికి రాలేదు.

స్వాతిలో సబ్ ఎడిటర్స్‌గా పనిచేసిన ముగ్గురు తర్వాత వివిధ సందర్భాల్లో నాకు తారసపడ్డారు. ఒకరు సినీ రచయిత జొన్నవిత్తుల. నా సీరియల్ 'సావిరహే' సీరియల్ ప్రూఫ్ రీడింగ్ తనే చూసానని మేం మద్రాస్‌లో ఓ సారి కలిసినప్పుడు చెప్పారు. మరొకరు ఋషిపీఠం సంపాదకులు శ్రీ సామవేదుల షణ్ముఖ శర్మ. మూడో అతను ప్రసాద్. ఇతను అట్టే కాలం రాని 'జయం' అనే వీక్లీ సహాయ ఎడిటర్‌గా హైదరాబాద్ వచ్చారు. స్వాతితో మొదటి నుంచీ అసోసియేట్ అయి ఉన్న కార్టూనిస్ట్ జయదేవ్ 'జయం' వీక్లీకి సంపాదకుడు కాబట్టి ఆయన ద్వారా వచ్చి ఉండచ్చు. తర్వాత ప్రసాద్ విజయవాడ నుంచి వచ్చిన రెండు మాసపత్రికల్లో కూడా ఎడిటర్‌గా పనిచేసారు తప్ప ఎందుకో మళ్ళీ వెనక్కి స్వాతికి వెళ్ళలేదు.

స్వాతి స్వంత ప్రెస్‌ని ఏర్పాటు చేసుకున్నాక స్వాతి దినపత్రిక వస్తోందని మా సర్కిల్స్‌లో వదంతి వచ్చింది. నేను కొద్దిగా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే డెలిగేషన్ ఆఫ్ పవర్ అనేది బలరాంకి తెలీదని నా అంచనా. నాకు తెలిసిన బలరాం సందిగ్ధతని భరించలేరు. తన వ్యాపారానికి సంబంధించిన ప్రతీది తనకి తెలిసి, తన ఆధీనంలోనే, తన అనుజ్ఞతోనే జరగాలని అనుకుంటారు. విజయ బాపినీడు గారిదీ ఇదే మనస్థత్వం. దినపత్రిక నడపటం లేదా సినిమా తీసే విషయంలో ఇది కుదరదు. నిత్యం ప్రవాహంలా వచ్చే వార్తలని జడ్జి చేసి ప్రచురించడానికి బలరాంకి తీరిక చిక్కదు. ఈ కారణంగా బలరాం వ్యాపారపరంగా సమర్థులై ఉండి కూడా, డెలిగేషన్ ఆఫ్ పవర్ విద్యని అద్భుతంగా తెలిసిన రామోజీరావు గారిలా ఎదగలేకపోయారు. ఎవరికైనా పనిని అప్ప చెప్పి బలరాం నమ్మి కూర్చోలేరు. దాంతో మనం స్వాతి సంస్థ నుంచి ఓ మంచి దినపత్రికని కోల్పోయాం అని నా భావన.

ఓ రోజు పి.వి నరసింహారావు ప్రధాన మంత్రి అయ్యాక ఆయన విదేశాలకి వెళుతూ కొందరు జర్నలిస్ట్‌లని తన విమానంలో వెంట తీసుకెళతారని తెలిసింది. అంతదాకా తెలుగు వారిని ఆయన వెంట తీసుకెళ్ళలేదు. నేనాయనకి తెలుగులో ఓ ఉత్తరం రాసాను. గతంలో నేను యూరప్, అమెరికాలని సందర్శించి ట్రావెలాగ్స్ రాసానని, అవి పుస్తకాలుగా వచ్చాయని, ఈసారి విదేశానికి తీసుకెళ్ళేప్పుడు ఆయన నన్ను తన వెంట తీసుకెళితే ఆ మొత్తం యాత్రని పుస్తకంగా రాస్తానని, అందువల్ల అవి లైబ్రరీలో చాలా కాలం ఉంటాయని, జర్నలిస్ట్‌లు తమ పత్రికల్లో రాసే వాటికి షెల్ఫ్ లైఫ్ ఉండదని ఆ ఉత్తర సారాంశం.

నాకు దానికి జవాబు రాలేదు. ఆ తర్వాత ఆయన విదేశాలకి వెళ్ళినప్పుడు స్వాతి బలరాం వెంట వెళ్ళారని చదివాను. ఆ సమయంలో అక్కడ పనిచేసిన పి.వి.ఆర్.కె ప్రసాద్ నా ఉత్తరం చదివాక వచ్చిన ఆలోచనల వల్ల తెలుగు వారికి ప్రాతినిధ్యం కల్పించారా? నాకు జవాబు తెలీని ప్రశ్న ఇది. కానీ ఇప్పుడు నేను రాసిన ఆ ఉత్తరం గురించి తలుచుకుంటే అప్పట్లో ఎంతటి అమాయకుడిని అనిపిస్తోంది.

బలరాం గారి అమ్మాయి మణిచందన పెళ్ళికి నాకు పోస్ట్‌లో వెడ్డింగ్ కార్డు వచ్చింది. కాని దానికి నేను సహజంగానే వెళ్ళలేదు. అభినందనలు తెలియచేసే మర్యాదపూర్వక ఉత్తరం కూడా రాయబుద్ధి పుట్టక రాయలేదు. ఆయన మీద నాకు గల ద్వేషం సాంద్రత తగ్గకుండా కొనసాగింది. ఆ తర్వాత ఒకే ఒక్కసారి నేను బలరాంని చూడటం తటస్థించింది. డాక్టర్. కె. వివేకానంద మూర్తి కూతురు రుద్రాణి పెళ్ళిబేగంపేటలో, ఎయిర్ పోర్టుకి వెళ్ళే దారిలోని రామ్‌దా మనోహర్ హోటల్‌లో జరిగింది. నేను ఇంగ్లండ్ వెళ్ళినప్పుడు శ్రీ వివేకానంద మూర్తి ఇంట్లోనే బస చేసాను. వారమ్మాయి పెళ్ళికి నాకు ఆహ్వానం రావడంతో వెళ్ళాను. ఇంగ్లండ్‌లో ఆయన ఇంట్లో బస చేసిన సత్యానంద్, కె.రాఘవేంద్రరావు, అల్లు అరవింద్ లాంటి చాలామంది ఆ పెళ్ళికి వచ్చారు. బలరాం కూడా. ఆయన కార్యక్రమం జరిగేప్పుడు స్టేజి మీదే ఉన్నారు. క్లోజ్డ్ సర్క్యూట్ టి.వి మానిటర్‌లో ఆయన కనపడుతూనే ఉన్నారు. వివేకానంద మూర్తి చెప్పారు, 'బలరాం ఉన్నారు మీకు కాలక్షేపానికి. నిన్న రాత్రే వచ్చారు. ఆయనకో గది ప్రత్యేకంగా తీసాను' అని. ఆయన్ని పలుకరించ బుద్ధికూడా కాలేదు. ఆయన్ని దాటుకుంటూ అక్షింతలు వేయడానికి వెళ్ళాను కాని ఇద్దరం ఒకర్నొకరం ఎరగనట్లే ప్రవర్తించాం. 'ఓ రోజు మా ఇల్లు

వెదుక్కుంటూ వచ్చి సర్క్యులేషన్ కోసం నా సీరియల్‌ని అడిగి, తనంతట తానే నన్ను దూరం చేసుకున్నాక నేనెందుకు పలకరించడం?' అని పలకరించలేదు. మేం ఇద్దరం గతంలో మా మధ్య గల అనేక మధురమైన వాటిని మరిచి మా ఇగోలని పట్టుకుని వేళ్ళాడాం.

ఆ తర్వాత నేను చాలాసార్లు ఆత్మ విమర్శ చేసుకున్నాను. 'ఆధ్యాత్మికతలోకి వచ్చాక నన్ను హర్ట్ చేసిన ప్రతి ఒక్కరినీ, ఆఖరికి నేను యువకుడిగా ఉండగా అనేక చెడు లక్షణాలతో నన్ను విపరీత మానసిక హింసకి గురిచేసిన స్త్రీతో సహా అందర్నీ క్షమించగలిగాను. నేను ద్వేషించే వ్యక్తే ఈ ప్రపంచంలో లేరు. అలాంటిది డబ్బు కోసం రాసిన ఓ పత్రికా ఎడిటర్‌తో, ఓ అహంభావ వ్యాపారి స్వభావంతో ఎందుకు రాజీ పడలేకపోయాను? ఇది ఇలా కొనసాగితే ఏదో ఓ జన్మలో అది తీరేదాకా ఆ ద్వేషం ఋణానుబంధంగా కొనసాగుతుంది కదా? అవకాశం దొరికింది కాబట్టి ఆయన్ని ఆ పెళ్ళిలో పలకరించనందుకు మన్నించమని రెండు వాక్యాలు రాయచ్చు కదా?' అని ఆలోచించాను.

కాని ఆ పని చేయడం, ఆయన్ని క్షమించడం నావల్ల కాలేదు. రచయితగా నాలోని అహంకారమే అందుకు అడ్డుపడుతోందని అర్థమైనా దాన్ని లొంగదీసుకోలేక పోయాను. నాలో పరిపక్వత లేదని కూడా గ్రహించాను. ఇది నాకు పెద్ద మానసిక సమస్య అయి సంఘర్షణలో పడ్డాను. 'స్వాతి వీక్లీని లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీగా చేయడంలో నా కలం కూడా కొంతవరకు పనిచేసింది, దాన్ని బలరాం విస్మరించి ప్రవర్తించారు' అనే కోణంలోంచే ఆలోచించడంతో నా అహంభావం దెబ్బ తినడం వల్లే అంత ద్వేషం నాలో చెలరేగింది. డి.పద్మజ పేర బలరాం నుంచి వచ్చిన ఆ నాలుగు వాక్యాల ఉత్తరం నాకు అతి పెద్ద షాక్‌ని ఇచ్చింది. దాంట్లోంచి కోలుకోలేకపోయాను. బహుశ ఇక్కడితో ఈ వ్యాసం 'నాకు భగవంతుడు అలాంటి రాజీ మనస్థత్వాన్ని ఈ జన్మలో ప్రసాదించుగాక!'తో ముగించేవాడిని. కాని విధి మరోలా ఉంది.

కొద్ది వారాల క్రితం నేను పనిలో ఉంటే మా ఆవిడ టీవీ ముందుకు పిలిచింది. బలరాం గారి భార్య, కూతురు విజయవాడ పోలీస్ కమీషనర్‌ని కలిసి స్వాతి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మెంబర్లుగా ఆశ్రయించడం, బలరాంని తన ఆఫీసులోంచి బయటకి బలవంతంగా పంపించేసారనే వార్త చూసాను. నాకు చాలా బాధ కలిగింది. ప్రతీ మనిషి 'తనది' అనుకునేది తన కుటుంబ సభ్యుల, ఆస్థిపాస్తుల విషయంలోనే. భార్య, భర్త, సంతానంల మధ్య ఉండే బంధం అత్యంత బలమైంది. ఆస్థిపాస్తులు ఇవాళ వచ్చి, రేపుపోయి, ఎల్లుండి ఇంకాస్త వెంటపెట్టుకుని రావచ్చు. కాని కుటుంబ సభ్యుల విషయంలో అలాకాదు. జపాన్‌లో సునామి వచ్చిన ప్రాంతంలో శిథిలాల మధ్య ఓ వృద్ధుడు కూలి పోయిన తన ఇంటి ముందు నిలబడి 'లోపల ఎక్కడైనా చిక్కుకుని, బ్రతికే ఉన్నారా?' అని తన కొడుకు, భార్య పేర్లని పిలిచే దృశ్యాన్ని బిబిసిలో ఇది రాసే రోజు చూసాను. అదీ బంధం.! అలాంటిది బలరాం గారికి అరవైయ్యవ పడిలో ఎందుకిలా అయింది అనిపించింది. ఆయన తదనంతరం ఆయన ఆస్థి మొత్తం ఆ కూతురికేగా వచ్చేది? ఇంతలో ఎందుకు ఇంత తొందర పడ్డారు? మనుషులు శాశ్వతం కాదుగా? బలరాం మీద నాలో పెల్లుబికిన సానుభూతి ఎంతటిదంటే, ఆవేశపరుడైన ఆయన ఎంత బాధపడుతున్నారో ఊహించుకుంటే, అతని మీద నాలో పేరుకున్న ద్వేషం మొత్తం ఆ క్షణంలోనే కరిగిపోయింది. ఆ రోజు నా ధ్యానం తర్వాత ఆయనకి మంచి జరగాలని దేవుడ్ని ప్రార్థించాను. హైకోర్టుకి వెళ్ళి ఆయన తన కష్టంతో తనది అనుకుని నిర్మించుకున్న ఇంట్లోకి, స్వాతి ఆఫీస్‌లోకి వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చిందంటే కారణం ఆయనే అయినా లేదా కాకపోయినా అది ఎంతటి దయనీయమైన స్థితి. దీనికి ఎందరు ఎన్ని కారణాలు చెప్పినా, బలరాంలోని వర్క్ హాలిజం, ఎడిటర్‌గా పెరిగినా అహంభావమే కారణం అని నేను పరిపూర్ణంగా నమ్ముతాను.

అంతకు మునుపు బలరాం మీద నాకున్న ద్వేషం ఎంతటిదంటే, ఆయన స్వంత ప్రెస్‌లో అచ్చయ్యే వేదాంతభేరి అనే ఆధ్యాత్మిక మాస పత్రికకి రచనలు పంపాలని ఉన్నా, స్వాతి ప్రెస్‌లో అచ్చవుతోందన్న ఒక్క కారణంగా పంపలేదు. అది నెల్లూరులోని వేరే ప్రెస్‌లో

అచ్చవడం మొదలయ్యాకే వేదాంత భేరిలో నా రచనలు వచ్చాయి. అలాంటి నేను బలరాంకి వచ్చిన ఈ ఇబ్బందికి కదిలిపోయాను. ఆయనకి మానసిక స్వాంతనని కలిగించడానికి నేను చేయగలిగింది ఒక్కటే. వెంటనే ఆయన పేరు మీద ఆయనలో నేను గమనించిన మంచి గుణాలని తెలియచేస్తూ, ఆయన ఎదుర్కొన్న సమస్యని నేను గుర్తించినట్లుగా, అసలు ఆ పాయింటే స్పృశించకుండా 'మీరు ఒంటరి కారు. మీలోని మంచి గుణాలే మీ సహచరులు' అనే భావనని కలిగించాలని వాటిని గుర్తుచేస్తూ తక్షణం ఓ ఉత్తరం రాసి పోస్టు చేసాను. పంతొమ్మిదేళ్ళ క్రితం నేను ఆఖరిసారి బలరాంకి నేను రాసిన నా వ్యక్తిగత ఉత్తరాన్ని బాక్స్ ఐటంగా ప్రచురించారు! ఆ ఉత్తరం అందుకున్న ఆయన్నించి కనీసం థాంక్స్ లెటర్ కూడా రాలేదు!

ఓ రచయిత్రి చక్కటి పత్రికని తెస్తున్నందుకు బలరాంని అభినందిస్తూ ఎప్పుడో రాసిన ఉత్తరం ఈ గొడవ జరిగాక స్వాతిలో వచ్చిందని ఎవరో చెప్పారు. తన ఇమేజ్‌ని పెంచుకోడానికి బలరాం దాన్ని వేసి ఉంటారు. దటీజ్ బలరాం!

అంతేకాదు. నాకు పంపబడ్డ స్వాతి వీక్లీని చూసినా బలరాం కనపడ్డారు. నా రచన వచ్చిన ఏ పత్రికా అది ప్రచురించబడ్డ పేజీకి గుర్తుగా కాగితం ఉంచి పంపడం ఇంతవరకూ జరగలేదు. బలరాం తీసుకున్న ఈ చిన్న శ్రద్ధ వల్ల ఆ పత్రికా నిర్వాహకుడి దక్షత ఎలాంటిదో, దాని నిర్వహణని ఎలా యజ్ఞంలా చేస్తున్నారో దాన్ని అందుకున్న వారికి తెలుస్తుంది. దటీజ్ బలరాం!

ఒకటి మాత్రం నిజం. ఏ మనిషీ పూర్తిగా మంచివాడూ కాదు. పూర్తిగా చెడ్డవాడూ కాదు. ఈ రెంటి మిశ్రమమే మనిషి. నేనైనా. మీరైనా. ఇదిలోతుగా గ్రహిస్తే మనం ఎవర్నీ ప్రేమించక్కర్లేదు. ద్వేషించక్కర్లేదు కూడా.

*(మిగిలిన విశేషాలు వచ్చేనెల)*

Click here to share your comments on this story